క్లుప్తంగా

నేడు చెక్కుల పంపిణీ

చండూరు : చండూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, అదేవిధంగా 58, 59 జీఓలకు సంబంధించిన పట్టాలను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారని తహసీల్దారు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 10 గంటలకు కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చండూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛోత్సవ్–2023 లో పాల్గొనేందుకు అన్ని రంగాలకు చెందిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాజా మొయిజుద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 15వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

20న 'చలో ఢిల్లీ'

నకిరేకల్ : అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ కోరారు. నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో బుధవారం జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని చెప్పిన కేంద్రం, నేటికీ ఆ హామీలను అమలు చేయనందుకు నిరసనగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి రాయి కృష్ణ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ఇందూరు సాగర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జ్వాలా వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, నాయకులు పజ్జూరి ఉపేంద్ర, బొమ్మిడి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందజేస్తున్న జ్ఞానసుందర్

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు బుధవారం కాంగ్రెస్ నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ పరీక్ష సామగ్రి అందజేశారు. అదేవిధంగా పాఠశాల గ్రంథాలయానికి భారత రాజ్యాంగం, తెలంగాణ రైతు చట్టం పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్లి సైదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీలత

కనగల్ : గ్రామాల్లో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టడం, పిల్లలను అమ్మడం, కొనడాన్ని నిర్మూలించడం, బాలబాలికలు వ్యసనాలు, చెడుమార్గం వైపు వెళ్లకుండా చూడడం బాలల రక్షణ కమిటీ ఉద్దేశమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, సర్పంచ్ గోలి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో నిర్వహించిన బాలల రక్షణ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఫోన్లకు ఆకర్షితులై తప్పుదారిన పట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యర్రమాద యశోదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు యర్రమాద స్వరూప, రాణి, సునిత చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

చండూరు : కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపాలిటీలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంచుకొండ కీర్తి సంజయ్, ఏఎన్ఎంలు ముబీనా, మంగమ్మ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ జెల్ల ముత్తిలింగయ్య బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ పోరెళ్ల సునిత, వైద్యాధికారి శ్వేత, సతీష్ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చండూరు : చండూరు మండల పరిధిలోని చామలపల్లి, గుండ్రపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కూలీల సంఖ్యల పెంచాలని ఏపీఓ శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో జోరుగా 'బెల్టు' దందా !

- ప్రతి గల్లీలో బెల్టు దుకాణాలు
- అమ్మకాలను ప్రోత్సహిస్తున్న పంచాయతీలు !
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు



మునుగోడు : మండలవ్యాప్తంగా బెల్టు దుకాణల్లో మద్యం ఏరులై పారుతోంది. నియంత్రించాల్సిన అధికారులు ముడుపులకు ఆశపడి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో గ్రామాల్లో గల్లీకి ఒక బెల్టు దుకాణం చొప్పున పెరిగిపోతున్నాయి. దీంతో గ్రామాల్లో యువకులు, మహిళలు, వృద్ధులు మద్యానికి బానిసలవుతున్నారు.

మండలవ్యాప్తంగా దాదాపు 300 పైగా బెల్టు దుకాణాలు

మునుగోడు మండలంలో 26 గ్రామ పంచాయతీలతోపాటు 20కు పైగా ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో గల్లీకి ఒకటి నుంచి రెండు, మూడు చొప్పున మండలవ్యాప్తంగా దాదాపు 300లకుపైగా బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో ఏకంగా వేలం పాట పాడి నాలుగైదు దుకాణాలకు మాత్రమే అనుమతిచ్చి ఏడాదికి రూ.50 వేల చొప్పున గ్రామ పంచాయతీలకు ఇచ్చేలా తీర్మానం చేసి మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారు. బెల్టు దుకాణాల వ్యాపారులు క్వాటర్‌కు రూ.10, బీరుకు రూ. 20 చొప్పున అదనంగా డబ్బులు వసూళ్లచేసి దర్జాగా అమ్ముతున్నారు.

మండల కేంద్రంలో 24 గంటలూ అమ్మకాలు..

మండల కేంద్రమైన మునుగోడులో ప్రభుత్వం నాలుగు మద్యం దుకాణాలకు లైసెన్స్ ఇచ్చింది. ఆ దుకాణాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయిస్తున్నారు. ఆ తరువాత కూడా మద్యం ప్రియులకు మద్యం లభిస్తోంది. మండల కేంద్రంలో దాదాపు 20కిపైగా బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఆ వ్యాపారులు రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు, తిరిగి తెల్లవారుజామున 3 గంటల నుంచి మద్యం విక్రయాలను కొనసాగిస్తున్నారు. మునుగోడులో బెల్టు దుకాణాలను నియంత్రించాలని మండల సర్వసభ్య సమావేశంతో పాటు జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. బెల్టు షాపుల నిర్వాహకులు అధికారులకు నెలనెలా మామూళ్లు చెల్లించడం వల్లే బెల్టు దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు చొరవ తీసుకుని మునుగోడు మండలంలో బెల్టు దుకాణాలను నిర్మూలించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

మండల కేంద్రంలో దాదాపు 20 బెల్టు దుకాణాల ద్వారా 24 గంటలు మద్యం విక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు.



–మిర్యాల వెంకన్న, మునుగోడు సర్పంచ్

త్వరలో దాడులు చేస్తాం

మునుగోడులోని బెల్టు దుకాణాల నిర్వాహకులకు గతంలో కౌన్సిలింగ్ ఇచ్చాం. తిరిగి విక్రయిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సిబ్బంది సెలవుల్లో ఉండడం వల్ల దాడులు చేయలేకపోతున్నాం. ఉన్న సిబ్బందితో దాడులుచేసి బెల్టు దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. బెల్టు దుకాణాలపై త్వరలో దాడులు నిర్వహిస్తాం.

–మల్లయ్య, ఎక్సైజ్ సీఐ

ఘనంగా బోనాల వేడుకలు



బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

కనగల్ : మండలంలోని కురంపల్లి గ్రామంలో వడ్డెర కులస్తులు తమ ఆరాధ్యదైవం ఈదమ్మకు బుధవారం బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓర్సు పెంటయ్య, చిన్న పెంటయ్య, శ్రీనివాస్, శేఖర్, శ్రీను, రవీందర్, భిక్షపతిలు పాల్గొన్నారు.

5న ఢిల్లీలో ర్యాలీ

రామగిరి(నల్లగొండ) : కార్మిక రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య రైతు సంఘం జిల్లా నాయకుడు కుంభం కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన నల్లగొండ పట్టణ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో వారు మాట్లాడారు. పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, గడ్డం రాములు, దండెంపల్లి యాదయ్య, విష్ణుమూర్తి, మల్లయ్య, కంచర్ల రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

మునుగోడు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో ఢిల్లీకి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం కోరారు. చలో ఢిల్లీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ప్రచార జీపు జాతాను బుధవారం ఆయన మునుగోడులో ప్రారంభించి మాట్లాడారు. రైతు సంఘం నాయకుడు ఐతరాజు నర్సింహ, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీపీఎం మండల కార్యదర్శి మిర్యాల భరత్‌కుమార్, సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు, యసరాని శ్రీను, వేముల లింగస్వామి, సాగర్ల మల్లేష్, గోసుకొండ నర్సింహ, కొమ్ము లక్ష్మయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

మర్రిగూడ : పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మెటీరియల్ అందజేసిన పీఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు చల్లం పాండురంగారావును అభినందించారు. కార్యక్రమంలో డీటీ జూటూరు తారకరామన్, ప్రిన్సిపాల్ శివస్వరూపరాణి, చైర్మన్ పందుల కృష్ణ, ఆకుల రఘుమయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అనురాధ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 489 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 431 మంది హాజరయ్యారని పరీక్షల సీఎస్ ఎస్.శివస్వరూపరాణి తెలిపారు.



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి



తిప్పర్తిలో మాట్లాడుతున్న వీరెల్లి చంద్రశేఖర్

రామగిరి(నల్లగొండ) : టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో పేపర్ లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితో కానీ సీబీఐతో గానీ సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఎంతో కష్టపడి చదువుతున్న నిరుద్యోగులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీ సభ్యులను తొలగించాలి అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండా వినయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసోజు యాదగిరిచారి, మండల ప్రధాన కార్యదర్శి వంగూరి రవి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల పరీక్ష పత్రం లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటే టీఎస్‌పీఎస్సీ సిబ్బంది డబ్బుల కోసం పేపర్ల లీకేజీకి పాల్పడడం దారుణమని అన్నారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులను, సిబ్బంది వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మామిళ్ల జానీయాదవ్, వరికుప్పల విష్ణు, వెంకన్న, శ్రీధర్, నవీన్, విష్ణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

నల్లగొండ టూటౌన్ : పానగల్ బైపాస్ వద్ద చేపలు అమ్ముకుంటున్న తమకు స్థలం కేటాయించాలని కోరుతూ మత్స్యకారులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. 15 సంవత్సరాలుగా వంది మంది మత్స్యకారులు చేపలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, హైవే అధికారులు వచ్చి రోడ్డు వెంట చేపలు తొలగించాలని ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తాము చేపలు అమ్ముకోవడానికి స్థలం చూపించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ గంగపుత్ర సంఘం నాయకులు వడ్డె బోయిన ఆంజనేయులు, సింగారపు విజయ్‌కుమార్, జి. శ్రీనివాసులు, హిమబిందు, వెంకటయ్య, మునాసు వెంకన్న, శ్రీనివాస్, పద్మ, మంగమ్మ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



గీతాంజలి పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు



కట్టంగూర్ ప్రాథమిక పాఠశాలలో..

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గీతాంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, వివిధ శాఖల అధికారులుగా, రాజకీయ నాయకులుగా బాధ్యతలు నిర్వహించి అలరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి హెచ్ఎం అమృతయ్య, కరస్పాండెంట్ కేవీ ప్రకాశ్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.వెంకటేశ్, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, ఉషాప్రకాశ్, సుప్రభ, ప్రవీణ్, భువనేశ్వరి, రాధ, ప్రశాంతి, కల్పన, నయోమి, మౌనిక ఉన్నారు.

ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయాలి



ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, షాపుల లైసెన్స్ రెన్యూవల్ చేయాలని మెప్మా పీడీ(ఇంటి పన్ను వసూళ్ల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి) శ్రీపాద రామేశ్వర్ సూచించారు. చిట్యాల మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లతో ఏర్పాటు చేసిన పన్ను వసూలు సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పన్ను చెల్లించని వారి ఆస్తులను మున్సిపల్ యాక్ట్–2019 ప్రకారం జప్తు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన బిల్ కలెక్టర్లతో కలిసి పట్టణంలో ఆస్తి పన్ను వసూలు తీరును పరిశీలించారు. అనంతరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పట్టణ ప్రకృతి వనం, పట్టణ నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కనగల్ : కనగల్ క్రాస్ రోడ్డు వద్ద నాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నాగం ప్రీమియర్ లీగ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నాగం ఫౌండేషన్ చైర్మన్ నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పరుశరాం, గడ్డం మహేష్, తిరందాసు కనకయ్య, బెజవాడ నంద గౌడ్, కానుగు గోపి, మండల వినోద్, జనగాం భిక్షం, పగడాల వెంకటేశం, కొంగల రమేష్, కట్ట అశోక్, కట్ట కుమార్, తలారి కిరణ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

శాలిగౌరారం : వల్లాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు నకిరేకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పది కుర్చీలు బహూకరించారు. క్లబ్ అధ్యక్షులు మారిడి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతినిధులు ఎర్ర శంభులింగారెడ్డి, కందాల వెంకట్‌రెడ్డి, యన్నం శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణమ్మ, ఉపాధ్యాయులు సారంగి నాగయ్య, వీరస్వామి పాల్గొన్నారు.



కుర్చీలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

యోగాతో మానసిక ప్రశాంతత



విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : యోగా ఆచరించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మినీస్టేడియం ఆవరణంలో స్థానిక ఏవీఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం యోగా మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీఎం ఈ టెక్నో స్కూల్ విద్యార్థులు యోగాసనాల వేసి ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల శారీరక రుగ్మతల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఏవీఎం ఈ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏవీఎం విద్యాసంస్థల అధినేత, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, స్టేడియం అధ్యక్షుడు రాచకొండ శ్రీధర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, ఏవీఎం అడ్మినిస్టేటర్ కందాల శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే నకిరేకల్ నుంచి పోటీకి సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య



మాట్లాడుతున్న వేదాసు వెంకయ్య

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే తాను నకిరేకల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి అధికార పార్టీలోకి వెళ్లిన నాటినుంచి నకిరేకల్ నియోజకవర్గంలో కార్యకర్తలకు ఎవరూ అండగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వనమాల రమేష్‌నేత, మేడబోయిన నాగరాజు, వేముల సత్తయ్య, గుణగంటి రాజు, ఎడ్ల మహాలింగం, ఐతరాజు వెంకన్న, షరీఫ్ తదితరులున్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి వేడుకలు



నకిరేకల్ : కేక్ తినిపించుకుంటున్న నాయకులు



చండూరులో..



మునుగోడులో..

నకిరేకల్ : బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి వేడుకలను బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి ప్రియదర్శిని ఆధ్వర్యంలో నకిరేకల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొవ్వూరి రంజిత్, గద్దపాటి రమేష్, మర్రి శోభన, దేశపాక రాజ్, చుక్క పూజిత, మేడి శ్రీనివాస్, విజయ్, శృతి, ముత్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : కాన్షీరాం 89వ జయంతిని డీఎస్పీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి దళిత శక్తి ప్రోగ్రాం జిల్లా నాయకుడు శ్రీనుమహారాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చండూరు మండల కమిటీ సభ్యులు శ్రీశైలం, సుమన్, రాజేష్, మధు, మహేష్, శంకర్, రాజ్‌కుమార్, వెంకట్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : కాన్షీరాం 89వ జయంతి వేడుకలు బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో మునుగోడులో ఘనంగా నిర్వహించారు. మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొట్ట శివకుమార్, నాయకులు గుర్రాల నాగయ్య, కత్తుల పరమేష్, గోలీ ప్రవీణ్, పి. హరీశ్, పందుల సురేష్, ఈరపురి జనార్దన్, తీగల రమేష్, వెంకట్, వేణు, నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాజ్‌వేపై గుంత



శాలిగౌరారం బస్టాప్ సమీపంలో కాజ్‌వేపై ఏర్పడిన గుంత

శాలిగౌరారం : నకిరేకల్–గురుజాల ప్రధాన రోడ్డుపై శాలిగౌరారం బస్టాప్ సమీపంలో ఉన్న కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. నకిరేకల్–గురుజాల రోడ్డు మండల కేంద్రంతో పాటు నకిరేకల్, మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి మండలాలకు అనుసంధానంగా ఉంది. ప్రధాన రోడ్డు కావడంతో రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఈ రోడ్డుపై ఉన్న కాజ్‌వే ఇరుకుగా ఉండడంతో ఇప్పటికే వాహనదారులు ప్రయాణించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కాజ్‌వేపై గుంత ఏర్పడడంతో వాహనదారులు పడే బాధలు అన్నీఇన్నీ కావు. ప్రస్తుతం మూసీనదిపై గురుజాల–మానాయికుంట మధ్య ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీంతో మండలంలోని వల్లాల వద్ద గల ఓ క్రషర్‌మిల్లు వద్ద నుంచి లారీలు ఓవర్ లోడుతో కంకరను తరలిస్తున్నాయి. లారీల ఓవర్‌లోడు ధాటికి కాజ్‌వే పగిలి గుంత ఏర్పడింది. పగటిపూటే వాహనదారులు ఇరుకు కాజ్‌వేపై పడిన గుంతవద్ద ప్రమాదాలకు గురవుతున్నారంటే ఇక రాత్రి వేళల్లో పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉంటుందో ఊహించవచ్చు. సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని కాజ్‌వే పై ఏర్పడిన గుంతను పూడ్చి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

గంట నర్సిరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, తదితరులు

నల్లగొండ : యూటీఎఫ్ సీనియర్ నాయకుడు గంట నర్సిరెడ్డి మరణం సమాజానికి తీరని లోటని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గంట నర్సిరెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గంట నర్సిరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, జగదీశ్‌చంద్ర, వెంకులు, చంద్రశేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, బక్క శ్రీనివాస్ చారి, అరుణలు, శేఖర్‌రెడ్డి విజయేందర్, అరుణ, సీహెచ్ రామలింగయ్య, నరసింహ, రమాదేవి, వెంకన్న మురళయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

మర్రిగూడ : పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూర్పు తండాలో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన, అక్షరభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల వరకు తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని, అనంతరం అనుసంధాన ఆహారం బిడ్డలకు అందించవచ్చన్నారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేస్తున్న సూపర్‌వైజర్ యశోద